# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 14-03-2016**

బడ్జెట్లో 25 వేల కోట్లు కేటాయించడంతో పాటు, మహారాష్ట్రతో ఒప్పందం కూడా పూర్తి చేసుకున్నందున నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పెంచాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అధికారులను కోరారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం నీటి పారుదల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రులు తన్నీరు హరీష్ రావు, ఈటెల రాజెందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, ప్రభుత్వ సలహాదారులు ఆర్. విద్యాసాగర్ రావు, ముఖ్య కార్యదర్శులు రామకృష్ణరావు, ఎస్.కె. జోషి, ఇ-ఇన్-సి మురళీధర్, ఓఎస్డి శ్రీధర్ దేశ్ పాండే, పలువురు సీనియర్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ప్రాణహిత / కాళేశ్వరం ప్రాజెక్టుల ద్వారా చేపట్టాల్సిన పనులపై సుదీర్ఘంగా సమీక్షించారు. గోదావరి నది నుంచి అన్నారం, సుందిళ్ల, మేడారం, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, బస్వాపూర్, గంధమల్ల, తలమడ్ల, మంచిప్ప తదితర ప్రాంతాల్లో నిర్మించే రిజర్వాయర్లకు నీరు చేరే విధానంపై చర్చించారు. ఎక్కడెక్కడ టన్నెళ్లు నిర్మించాలి? ఎక్కడ పంపింగ్ చేయాలి? ఎక్కడ గ్రావిటీ ద్వారా నీళ్లివ్వాలి? అనే అంశంపై అధికారులు ఇప్పటికే తయారు చేసిన నివేదికలను ముఖ్యమంత్రి పరిశీలించారు. గోదావరిలో నీరు పుష్కలంగా అందుబాటులో ఉన్న సమయంలోనే ఎక్కువ నీటిని పంప్ చేసి రిజర్వాయర్లు నింపుకోవాలని సిఎం సూచించారు. దేవాదుల పంపుహౌజ్ దిగువ భాగంలో బ్యారేజి నిర్మించడం ద్వారా ఏడాది పొడవునా ప్రాజెక్టుకు నీరందుతుందని, దీని ద్వారా వరంగల్ జిల్లాలోని చాలా వరకు భూమికి సాగునీరు అందివ్వవచ్చని చెప్పారు. తక్కువ ముంపు ఎక్కువ ప్రయోజనం కలిగేలా దేవాదుల ప్రాజెక్టును ఉపయోగించుకునే విధంగా బ్యారేజి ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాణహిత, కాళేశ్వరం, శ్రీ సీతారామ, పాలమూరు, డిండి తదితర ప్రాజెక్టుల పనులు ఏకకాలంలో జరగాలని సిఎం చెప్పారు.

ఆన్ గోయింగ్ ప్రాజెక్టులను కూడా త్వరిత గతిన పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. మూడు నాలుగేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి కోటి ఎకరాలకు నీరందించే ప్రణాళిక అమలు చేయాలని కోరారు. అధికారులు, వర్కింగ్ ఏజన్సీలతో నిత్యం సమన్వయం చేసుకుని ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేయాలని మంత్రి హరీష్ రావుకు సూచించారు. సాగునీటితో పాటు హైదరాబాద్ మంచినీటి రిజర్వాయర్ నిర్మాణానికి కూడ వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొత్త రిజర్వాయర్లు కట్టడంతో పాటు ఎల్లంపల్లి, మిడ్ మానేరు, లోయర్ మానేరు, నిజాం సాగర్, ఎస్ఆర్ఎస్పి, సింగూరు ప్రాజెక్టుల కింద ఆయకట్టును స్థిరీకరించడం కోసం గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా రైతులు రెండు పంటలు పండించాలనే కల నెరవేర్చాలని చెప్పారు.

**సిపిఆర్ఓ టు సిఎం**